చిత్రాలు: దెందుకూరి రఘునాథ్

కిరణ్ ప్రభ
నిషిగంధ
ముకుంద రామారావు
పెమ్మరాజు వేణుగోపాలరావు

## నేనూ-వాడూ..!

-కిరణ్‌ప్రభ



వేకువ గుమ్మంలో నిలుచున్నప్పుడు
ప్రకృతి చైతన్య గానాన్ని
వింటుంటాను నేను-
పగలు చెయ్యాల్సిన పనులు
గుర్తుచేస్తుంటాడు వాడు..!

కొండ కొమ్మున చేరి కిందికి చూస్తున్నప్పుడు
లోయల సౌందర్యానికి

అబ్బురపడుతుంటాను నేను-
అగాధాల లోతుని బేరీజు వేసి
భయపెడుతుంటాడు వాడు..!

మునిమాపులో గోధూళివేళ
గూటికి చేరే పక్షుల కువకువ రాగాల్ని
విని పరవశిస్తుంటాను నేను-
కమ్ముకొచ్చే చీకటిని
భూతద్దంలో చూపెడతాడు వాడు..!

వెన్నెల పుచ్చ పువ్వులా పరుచుకున్నప్పుడు
శీతల కిరణాల కొలనులో
మునకలేస్తుంటాను నేను -
తరుముకొస్తున్న కారుమేఘాన్ని చూపించి
హెచ్చరిస్తుంటాడు వాడు..!

జీవన చదరంగలోని
తెలుపు నలుపుల వైచిత్రిని
ఆసక్తితో గమనిస్తుంటాను నేను -
తరువాత వెయ్యాల్సిన ఎత్తుగురించి
తొందర చేస్తుంటాడు వాడు..!

భావుకతకు రెక్కలు తొడిగి రసరాజ్యాలను చేరాలని నేను..
ఊహలకు సంకెళ్ళు వేసి వాస్తవంలోకి లాగాలని వాడు..!

# బంగారు తల్లి!!

**-నిషిగంధ**



వొడిలో నా ప్రపంచం
ఆదమరచి నిద్రపోతోంది..

తన గుప్పెట్లో
బిగుసుకున్న నా వేలు..
ఆలంబన అవసరం
నాదేనన్నట్లు!!

నా పసితనపు
ఘడియల్ని మళ్ళీ చూపిస్తున్న
బుల్లిపాదాలు..
స్పృశించకుండా ఉండటం
నాతరమేనా!?

ఏమనిపించిందో
నిద్రలో నిండుగా నవ్వింది..
గదిలో తెల్ల గులాబీలు
విరబూసాయి!!



విజయవాడలో పుట్టి పెరిగిన నిషిగంధ గత 8 సంవత్సరాలుగా మయామి ఫ్లోరిడా లో ఉంటున్నారు. పుస్తక పఠనం, పాటలు వినడం, స్నేహితులతో కబుర్లుచెప్పడం వీరి అభిరుచులు. మనసును కదిలించిన భావాలను కవితల రూపంలో వ్యక్తపరచటం వీరి అలవాటు .



## స్వంతం

-ముకుంద రామారావు



దిగువున ఉన్నాం
రోజూ నీళ్ళొస్తాయి
ఉన్న నీటిని ఒంపేయి
మళ్ళీ పూర్తిగా నింపు
బట్టలన్నీ ఉతుకు
అన్నింటినీ శుభ్రం చేయి
మొక్కలన్నింటికీ పోయి
కుండీలన్నీ నింపు
డాబా బాగా తడుపు
ఇంకా వస్తుంటే ఆపేయకు
ఆగేవరకూ వాకిలంతా తడవనీ
ఒక్క నీటిచుక్కని కూడా ఎటూ పోనీయకు



హెచ్.పి. కంపెనీలో సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఇటీవలే రిటైరయ్యారు.
తెలుగులో అద్భుతమైన కవితలు వ్రాస్తున్న రామారావు గారు
ఇంతవరకూ మూడు కవితా సంకలనాలను ప్రచురించారు.

# సూర్య కమలం

- పెమ్మరాజు వేణుగోపాలరావు

మా యింట నందనోద్యాన వనంలో
ఎదురు చూస్తూ ఉంటుంది నిత్యం
సూర్య కమలం ఒకటి
సూర్య కిరణాల కోసం.
ప్రొద్దు చూస్తూ తిరిగే పువ్వు
ప్రొద్దు తిరుగుడు పువ్వు
ముద్దుగా మేము పెంచిన మొక్క
ధరణికి ఆభరణ కమలం.
ఎదురు చూస్తూ కూర్చుంటుంది
ఆఖరి కాంతికిరణం తనమీద పడి
తనలో ఐక్యమయ్యే వరకూ.



ప్రతి కాంతి కిరణం తన ఘోష చెప్పుకుని
తన ఒడిలో సేద దీర్చుకుంటూ
విశ్రాంతి తీసుకుంటూంటే సృష్టికి తను చేస్తున్న
సహకారం తలుచుకుంటూ
సంతృప్తితో గర్వపడుతుంది.

ఎర్రని కాంతి కిరణం ఒకటి ఆవేశంతో ఒగర్చుకుంటూ
ఆయాసపడుతూ వచ్చి
గుక్క తిప్పుకోకుండా చెప్పిన మాటలు.

నేను మామూలు కాంతి కణాన్ని కాదు
సూర్య మండల గర్భకుహరంలో
జన్మించిన సూక్ష్మ కణాన్ని
మిలియను సంవత్సరాలు పట్టిందా
అగ్ని గోళపుటంచులు చేరటానికి.
దారి పొడుగునా గండాలే

నన్నటు తిప్పి ఇటు తిప్పి రకరకాలుగా సాగదీసి
నానా అవస్థలు పెట్టిన వివిధ పదార్ధ కణాలు
ప్రొటానులు, న్యూట్రానులు, న్యూట్రినోలు, ఎలక్ట్రానులు
చెప్పలేనన్ని భూతాలు
అయస్కాంత క్షేత్రాలలో
సుడి గుండాలలో తిరుగుతూ
రకరకాల విద్యుత్కణాలు
నన్ను మింగి నమిలి విసిరి పారేశాయి.
బయటపడి స్వేచ్ఛగా హాయిగా పరుగెడుతూ
ప్రవహిస్తున్నాననే సంతృప్తి క్షణం మాత్రమే.
పేరు లేదు చిరునామా లేదు
కనివిని ఎరుగని అగాధం
గురుత్వాకర్షణ శక్తితో
అన్నిటిని ఆరగించే అహోబిల క్షేత్రం
సరిహద్దుల్లో చిక్కుపడి
హతమారిపోతానేమోనని
భయపడిపోయాను.
దీనంగా పలికింది కణం.

గర్వంతో పలికింది సూర్యకమలం
మా సూర్య మండలంలో
అగాధాలు లేవు, అన్యాయాలు జరగవు.

నేను పుట్టిన సూర్యమండలం
విన్న వించుకుంది కాంతి కిరణం
మీ స్వంతపరగణా కాదు
మరొక ప్రపంచపు సరిహద్దుల్లో
మరొక మార్తాండ మండలం
దారిలో చెప్పుకుంటున్నారు
ఈ విశ్వాంతరాళంలో

లక్షలు, మిలియన్లు , కోట్లు, బిలియన్లు
ఎన్నో సూర్య మండలాలున్నాయట
మీ ఊళ్ళో భౌతిక శాస్త్రజ్ఞులే
కనిపెట్టారీ అద్భుత విశేషం.

తను పుట్టిపెరిగిన భూప్రపంచమే
విజ్ఞానానికి పునాది వేసిందని
తనని పెంచిన మానవుడి మేధస్సే
విశ్వమంతా వెలుగుతోందనీ
సంతృప్తిచెంది తలవంచింది

ఆఖరి స్వర్ణకిరణం
సూర్యకమలంలో కరిగి పోయింది.



పెమ్మరాజు వేణుగోపాలరావుగారు ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపురంలో పుట్టారు. వీరి విద్యాభ్యాసం ఏలూరు, వాల్తేరు, యూజీన్ (ఓరిగన్) లలో జరిగింది. భౌతికశాస్త్రంలో డాక్టరేటు. ప్రస్తుతం ఎమరీ విశ్వవిద్యాలయంలో అణుశాస్త్ర పరిశోధనలో అధ్యాపకులు. చిత్ర, కవిత్వ నాటక కళలలో ఉత్సాహం, ప్రవేశం, అనుభవం కలవారు. సతీమణి స్వరాజ్యమహాలక్ష్మి, కుమార్తెలు నళిని, సలీనా.